నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ నోమా ఫీడర్ పరిధిలో విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చాణిక్యపురి కాలనీ, సూర్యనగర్, గోకుల్‌నగర్, మోదీ వెంచర్స్, ఛాండీయనగర్, బాబానగర్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు మల్లాపూర్ విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. 11కేవీ అన్నపూర్ణ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జనప్రియ టవర్స్, సాయిటవర్స్, అన్నపూర్ణ కాలనీ, లింగమయ్యనగర్ కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

హుండీ లెక్కింపు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగింది. 69 రోజుల హుండీ లెక్కింపు ద్వారా సుమారు రూ.3,56,940 ఆదాయం వచ్చిందని ఈఓ ఏబీ. రవీందర్‌రెడ్డి తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో..

గుర్తు తెలియని మృతదేహాల స్వాధీనం

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు గుర్తు తెలియని వ్యక్తి (50) మృతదేహం పట్టాలపై పడిఉందనే సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బుధవారం ఉదయం రైలు నుంచి కిందపడ్డాడా.. లేదా పట్టాలు పక్క నుంచి గుర్తు తెలియని రైలు ఢీకొని మృతిచెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించామన్నారు. వివరాలకు 9440083160.

మరో చోట..

ఘట్‌కేసర్: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ టిఫిన్ సెంటర్ ఎదురుగా 60 ఏళ్లున్న వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. వివరాలు తెలిసిన వారు 8712662705.

రైతు సమస్యలు తీర్చడమే రెవెన్యూ సదస్సు లక్ష్యం

శామీర్‌పేట్: రైతుల సమస్యలను తీర్చడమే రెవెన్యూ సదస్సు లక్ష్యమని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్ అన్నారు. బుధవారం శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల రెవెన్యూ పరిధిలో తహసీల్దారులు యాదగిరిరెడ్డి, వెంకటనరసింహారెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు రెవెన్యూ సదస్సులకు విశేష స్పందన లభించిందన్నారు. శామీర్‌పేట మండలంలో ముందాయిపల్లి 7, అంతాయిపల్లిలో 17, మొత్తం 24 ఫిర్యాదులు వచ్చాయన్నారు.

◆ మూడుచింతలపల్లి మండల పరిధిలోని పోతారంలో 8, కేశవాపూర్‌లో 49, యాకత్‌పూర్‌లో 17, మొత్తం 74 ఫిర్యాదులు వచ్చాయని, తహసీల్దార్ వెంకటనరసింహారెడ్డి తెలిపారు. రైతులు సమర్పించిన పిర్యాదులను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

డంపింగ్‌యార్డును తొలగించాలని వినతి

పోచారం: అన్నోజిగూడలోని ఓఆర్‌ఆర్ సర్వీసు రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును తొలగించాలని కోరుతూ పోచారం మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డికి యానంపేట్ ప్రాంతానికి చెందిన పాలకూర పోశెట్టి బుధవారం వినతిపత్రం అందజేశారు. డంపింగ్ యార్డు వల్ల పక్కనే ఉన్న పొలాల్లోకి ప్లాస్టిక్ కవర్లు, చెత్తా,చెదారం చేరుతోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీంతో భూములతో పాటు భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయన్నారు. రహదారి పక్కనే డంపింగ్‌యార్డును ఏర్పాటు చేయడంతో దుర్వాసన వ్యాపిస్తోందని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా డంపింగ్‌యార్డును నివాసప్రాంతాలకు దూరంగా తరలించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ.. సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

కొర్రెముల్‌లో 68 అర్జీల స్వీకరణ

పోచారం: భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఘట్‌కేసర్ మండల తహసీల్దారు డీఎస్ రజిని కోరారు. బుధవారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడుతూ.. ప్రజలు భూ సమస్యలపై రెవెన్యూ అధికారులకు అర్జీలను అందజేయాలన్నారు. ముఖ్యంగా పీఓబీ తొలగింపు, మ్యుటేషన్లు, విస్తీర్ణ సవరణలపై మొత్తం 68 అర్జీలు స్వీకరించినట్లు చెప్పారు. సీనియర్ అసిస్టెంట్ ఆదిత్య, ఆర్ఐ కావ్యరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'వాటర్ లాగింగ్' సమస్యకు పరిష్కారమెలా ?

ఏళ్లుగా వరదతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

పరిష్కారం చూపని జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం

వర్షం వచ్చిందంటే చెరువులను తలపిస్తున్న రహదారులు



రామంతాపూర్‌లోని రహదారి పక్కన..

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ అదేశాలను సైతం అధికారులు బేఖాతరు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్ పదవీ బాధ్యతలు తీసుకున్న వెంటనే ఎల్‌బీనగర్ జోన్ పరిధిని కలియ తిరిగారు. లోతట్టు ప్రాంతాలపై ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని మండిపడ్డారు. వెంటనే లోతట్టు ప్రాంతాలు ముఖ్యంగా రహదారులపై ఉన్న వాటర్ లాగింగ్ ప్రాంతాలను వెంటనే యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఉప్పల్ సర్కిల్ పరిధిలో గత దశాబ్దకాలంగా సర్కిల్ పరిధిలో ఉన్న వివిధ డివిజన్లలో వాటర్ లాగింగ్ ప్రాంతాలు ప్రజలకు శాపంగా మారాయి. వర్షం వచ్చినప్పుడల్లా అధికారులు తూతూ మంత్రంగా నీటిని పంప్ చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్పా.. శాశ్వత పరిష్కార దిశగా అడుగులు పడటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

◆ ముఖ్యంగా ఉప్పల్ నల్ల చెరువు న్యూరో కేర్ ఆసుపత్రి వద్ద కాసింత వర్షం వచ్చిందంటే రోడ్డు పూర్తిగా జలమయమై చెరువును తలపిస్తోంది. ఫలితంగా గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఏమి చేయాలో తోచక ట్రాఫిక్ అధికారులే గునపం పార పట్టి రంగంలోకి దిగిన ఘటనలు కోకోళ్లలు ఉన్నాయి.

◆ రామంతాపూర్ మాడ్రన్ బేకరి సర్వే ఆఫ్ ఇండియా కాంపౌండ్ వాల్ వద్ద రామంతాపూర్ నుంచి ఉప్పల్ వైపు వర్షం వచ్చినప్పుడల్లా రోజుల తరబడి వరద నీటితో పాటు డ్రైనేజి నీరు సైతం పొంగుతూ.. వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. దేవేందర్‌నగర్ రోడ్డు, వెంకట్‌రెడ్డినగర్, చిలుకానగర్ డివిజన్ పరిధిలోని కావేరినగర్, రామంతాపూర్ హోమియోపతి రోడ్డు ఇలా అనేకచోట్ల వాటర్ లాగింగ్ ప్రాంతాలున్నా.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటాం



వాటల్ లాగింగ్ ప్రాంతాలను ఇప్పటికే గుర్తించాం. వాటి కోసం ప్రత్యేకంగా మాన్‌సూన్ టీమ్‌లను ఏర్పాటు చేశాం. వీరు ప్రత్యేకంగా వర్షం పడితే వెంటనే ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తారు. సాధ్యమైనంత త్వరగా వరద నీటిని పంపింగ్ చేస్తారు. అప్పటికీ సాధ్యం కాకపోతే మోటార్ల ద్వారా నీటిని తోడేందుకు యంత్రాంగం సిద్ధమైంది. ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటాం.

– ఆంజనేయులు, ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్

సిమెంట్‌లో తిరుగు లేని సంస్థగా భారతీ సిమెంట్

తాపీమేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్‌ల అందజేత



మేడిపల్లి: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతీ సిమెంట్ అని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహ్మద్ సాహేర్ అన్నారు. పీర్జాదిగూడ శ్రీలక్ష్మీగణపతి ట్రేడర్స్, డీలర్ షాపులో తాపీమేస్త్రీల సమావేశం నిర్వహించారు. బుధవారం ఒక్కొక్కరికి రూ.1లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్‌లు, సైటు వద్దకే వచ్చి సహాయపడతారని తెలిపారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతీ అల్ట్రాఫాస్ట్ సిమెంట్ రూ.20 అధికంగా ఉంటుందని పేర్కొన్నారు.

జేఏసీ కన్వీనర్ల నియామకం



నియామక ఉత్తర్వులను అందజేస్తున్న నల్లారాధాకృష్ణ

మల్లాపూర్: తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ (టీయూజేఏసీ) నాచారం డివిజన్‌గా హెచ్‌ఎంటీనగర్ కాలనీకి చెందిన కనుకుంట్ల విజయ్‌కుమార్ కో–కన్వీనర్‌గా ఎర్రకుంట కాలనీకి చెందిన గద్ద యుగేందర్‌లను నియమిస్తూ.. టీయూజేఏసీ ఫౌండర్, చైర్మన్ నల్లారాధాకృష్ణ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన ఉద్యమకారుల సంక్షేమ పథకాల సాధనకు ఉద్యమిస్తామన్నారు.

బఫర్ జోన్ స్థలాన్ని పరిరక్షించండి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీలోని 106 సర్వే నెంబర్‌లో కొంతమంది కబ్జారాయుళ్లు భూమిని చదును చేస్తున్నారన సదరు స్థలాన్ని కాపాడాలని బుధవారం ఉప్పల్ తహసీల్దార్ వాణిరెడ్డికి నాచారానికి చెందిన ఎండీ ఆశ్రూ, గుండు రమేష్‌గౌడ్‌లు వినతిపత్రం అందజేశారు. గతంలో కుడా బఫర్‌జోన్ స్థలాన్ని పరిరక్షించాలని వినతిపత్రం అందజేశామన్నారు. దీనికి తహసీల్దార్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.



పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



దయానంద్‌నగర్ రైల్వేస్టేషన్ వద్ద మొక్కలు నాటుతున్న ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్

గౌతంనగర్: పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సంజీవరావు అన్నారు. బుధవారం దయానంద్‌నగర్ రైల్వేస్టేషన్‌లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సంజీవరావు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఎస్సై దీప్తి, సైని, డీఆర్‌యూసీసీ సభ్యులు నూర్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం

ఉప్పల్: స్వరూప్‌నగర్ కరిగిరి వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వహణ బాధ్యతలను ఇక నుంచి దేవదాయ ధర్మాదాయశాఖ చేపట్టనుంది. బుధవారం నూతన ట్రస్ట్‌బోర్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారుల సమక్షంలో ధర్మకర్తలుగా రమేష్ గుప్తా, చింతలకుంట శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి, నరసింహాచారి, పూజారి హనుమంతు, రాకేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆనంద్‌ప్రభు, నాగారం గాయత్రిదేవి, వెంకట్‌రెడ్డి, వంక పవన్‌కుమార్, కందాడి సత్తిరెడ్డి, శ్రీనివాస్‌లను ఈవో వెంకన్న ప్రమాణ స్వీకారం చేయించారు.



నూతన కమిటీ సభ్యులు

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యమకారుల ఫోరం సభ్యులు

కాప్రా: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులు కోరారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షినటరాజన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాప్రా సర్కిల్‌కు చెందిన పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ అమలు చేయాలని కోరారు. ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేసి ఉద్యమకారులకు గుర్తింపుకార్డు, సంక్షేమ పథకాల్లో 20 శాతం కోట, సంస్కృతి కళా ఉద్యమకారులకు ఉద్యోగ అవకాశాలతో పాటు రూ.10వేల కోట్ల బడ్జెట్‌తో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. తమ వినతులను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు. దయానంద్, కొండస్వామి, గగన్‌కుమార్, జగన్‌యాదవ్, ఇందర్‌కుమార్, శివకుమార్, గౌస్, రవీందర్, రవి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

రామంతాపూర్ : హబ్సిగూడ డివిజన్ రామంతాపూర్ పరిధిలోని కామాక్షిపురం వాసవీనగర్, వెంకట్‌రెడ్డినగర్ కాలనీలో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ సమస్యను ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్‌పటేల్ జలమండలి అధికారులు, కాలనీవాసులతో కలిసి బుధవారం విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. డ్రైనేజీ సమస్యలున్న ప్రాంతాల్లో కొత్త పైపులైన్ల కోసం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చి త్వరలోనే పనులు ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీ, బస్తీల్లో అక్కడక్కడ నెలకొన్న చిన్న, చిన్న డ్రైనేజీ సమస్యలను రెండ్రోజుల్లో పూర్తి చేయిస్తానని ఆయన కాలనీవాసులకు హామీ ఇచ్చారు. జలమండలి మేనేజర్ రవీందర్, ఇన్‌స్పెక్టర్ కిషన్, విజయ్‌కుమార్ యాదయ్యతో పాటు కాలనీ సంక్షేమ సంఘం నేతలు పాల్గొన్నారు.

అక్రమంగా దుకాణంలోకి చొరబడి..

నష్టం కల్గించారని ఫిర్యాదు

మల్కాజిగిరి: దుకాణంలోకి అక్రమంగా చొరబడి నష్టం కలిగించారని యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ మీర్జాలగూడలో మహ్మద్‌నయూమ్ దక్కన్ ఎంటర్‌ప్రైజెస్ పేరున దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున మణీష్, దీపక్‌తో పాటు మరి కొందరు దుకాణం షెట్టర్‌ను తొలగించి దుకాణంలోని ఫర్నిచర్ ధ్వంసం చేయడమే కాకుండా క్యాష్‌కౌంటర్‌లోని రూ. 40,000 దొంగతనం చేశారని, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఇరువురి మధ్య కోర్టులో వివాదం ఉన్నట్లు సమాచారం.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఉప్పల్: ఉప్పల్ భగాయత్‌లోని పార్కులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఉప్పల్ భగాయత్‌లోని జీహెచ్‌ఎంసీ పార్కులో గుర్తు తెలియని వ్యక్తి పడిఉన్నాడన్న సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని 108ను పిలిపించారు. వారు పరిశీలించగా.. అప్పటికే అతడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అనారోగ్య కారణాలతో మృతిచెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆలయ నిర్మాణానికి విరాళం

మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరిలో పునర్నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయానికి రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. విరాళం అందజేసిన వారిలో వ్యాసగోని శ్రీనివాస్‌గౌడ్, చెన్నయ్యగౌడ్, రాజేష్‌గౌడ్, శంకర్‌గౌడ్, నరహరిగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, సాయిగౌడ్ ఉన్నారు.

నేటి నుంచి వల్లభ గణపతి ఆలయ బ్రహ్మోత్సవాలు

మల్కాజిగిరి: వసంతపురి కాలనీలోని వల్లభ గణపతి దేవాలయ 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి 7 వరకు జరుగుతాయని ఆలయ నిర్వాహకుడు మురళీధర్ ప్రకటించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

'కార్మికుల సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తుతా'..

ఎంపీ ఈటల రాజేందర్



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

రామంతాపూర్ : తెలంగాణ డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్, గృహ కార్మికుల యూనియన్ నేతలు బుధవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఇళ్లలో పనిచేసే గృహ కార్మికులకు కనీస వేతనాల చట్టం పరిధిలోకి తీసుకురావాలని, అదే విధంగా వారి ఆరోగ్యభద్రతకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించి ఇందిరమ్మ ఇళ్ల కేటాయించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ ఈటల సానుకూలంగా స్పందిస్తూ.. ఇళ్లలో పనిచేసే గృహ కార్మికుల సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈనెల 16న రామంతాపూర్‌లో జరిగే గృహ కార్మికుల దినోత్సవంలో పాల్గొంటానని ఆయన హామీ ఇచ్చారు. నేషనల్ డొమెస్టిక్ వర్కర్స్ రాష్ట్ర కన్వీనర్ సిస్టర్ లిస్సి జోసెఫ్, అధ్యక్షురాలు మంజుల, సిస్టర్ జనస్టస్ మనోహర, శోభ, మాధురి, నిర్మల, పవన్, నవనీత తదితరులున్నారు.

సమీక్షలు ఉండవు.. పర్యవేక్షణ కరువు

- జీహెచ్‌ఎంసీ తీరుపై ఎమ్మెల్యే మండిపాటు..
- కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



అల్వాల్: జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై నియోజకవర్గ సమస్యలపై బుధవారం నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే బోర్డు సెప్టెంబర్, 2022లో తీర్మానం చేసుకుని రైల్వే లెవెల్ క్రాసింగ్‌లు ఆర్‌యూబీల నిర్మాణం కోసం 100 శాతం నిధులు ఇస్తామని ఎన్‌వోసీలు తీసుకున్నారన్నారు. ఇప్పటి వరకు సంబంధిత శాఖల నుంచి ఎలాంటి సమాధానాలు రాలేదని, వివరాలు సరిగ్గా లేకపోవడంతో ఆ ఫైల్‌ను వెనకకు పంపిస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని పలు వార్డు కార్యాలయాల్లో తాళాలు వేసి, నిరుపయోగంగా ఉన్న వార్డు కార్యాలయాలను కమ్యూనిటీహాల్‌గా స్థానిక కాలనీవాసులకు ఉపయోగపడేలా చూడాలన్నారు.

◆ మచ్చబొల్లారం డివిజన్‌లోని సర్వేనెంబర్–198, 199లోని హిందూశ్మశానవాటికలో రెండెకరాల్లో డంపింగ్‌యార్డు నిర్మించి రాంకీ సంస్థకు అప్పగించారని, స్థానిక డిప్యూటీ కమిషనర్ రెండెకరాల స్థలం డంపింగ్‌యార్డుకు కేటాయించారన్నారు. స్థానిక ఎమ్మార్వో అది హిందూ శ్మశానవాటిక స్థలమని చెబుతున్నారన్నారు. ఈ శ్మశానవాటికను పరిరక్షించాలని కోరారు.

◆ మల్కాజిగిరి డివిజన్ సఫిల్‌గూడలోని సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం వద్ద చెక్‌డ్యామ్ కట్టేటప్పుడు సిల్ట్ తీయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు.

◆ పారిశుద్ధ్య కార్మికుల కొరతతో మల్కాజిగిరి నియోజకవర్గంలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా జరగడం లేదని, ఈ విషయం ఏఎంహెచ్‌వోల దృష్టికి తీసుకెళ్లినా కార్మికుల సిబ్బంది కొరత ఉందన్నారు. దీనిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి నూతన ప్రతిపాదనలు ఆయన జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు అందజేశారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు



బోడుప్పల్: 21వ డివిజన్ పరిధిలో తాగునీటి సరఫరా సమస్యలపై జలమండలి మేనేజర్ మమత మాజీ కార్పొరేటర్ సుమన్‌నాయక్‌తో కలిసి పర్యటించారు. బుధవారం డివిజన్ పరిధిలో తాగునీటి సమస్య, సరఫరాపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూస్తామని, తాగునీటికి సంబంధించిన పనులను త్వరితగితిన పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని పేర్కొన్నారు. డివిజన్ అధ్యక్షుడు ఎలిగొండయ్య, సూపర్‌వైజర్ అనిల్, లైన్‌మెన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

రూ.13.50 లక్షలతో అభివృద్ధి పనులు

బోడుప్పల్: రోడ్ల అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు బోడుప్పల్ కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్ అన్నారు. చెంగిచర్ల కాకతీయనగర్ కాలనీలో రూ.13.50 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్‌కు ప్రాధాన్యనితనిస్తున్నట్లు వివరించారు. మాజీ కో–ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్, సీనియర్ నాయకులు ఉమేష్‌చారి, కట్ట జగన్, కాలనీ అధ్యక్షులు భరత్, మంగ పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనుల శంకుస్థాపనలో ప్రభాకర్‌గౌడ్

క్రీడలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలి



బొంతు శ్రీదేవి

కాప్రా: పేద, మధ్యతరగతి విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారని, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జరిగిన జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. క్రీడా మైదానాలున్నా.. శిక్షణ ఇచ్చేందుకు కోచ్‌లు లేక మైదానాలు వెలవెలబోతున్నాయన్నారు. చాలా మంది విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి ఉన్నా.. ప్రభుత్వ క్రీడా మైదానాల్లో కోచ్‌లు లేకపోవడంతో ప్రైవేటు కోచింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో ఫీజులు చెల్లించలేక పేద విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వ క్రీడా మైదానాల్లో కోచ్‌లను నియమించాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కోరారు. పార్ట్‌టైమ్ కోచ్‌లుగా కాకుండా పర్మినెంట్ కోచ్‌లను నియమించాలని విజ్ఞప్తి చేశారు.

ఏస్‌రావునగర్‌లో మలబార్ జువెలరీ ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శిరీష

కాప్రా: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంను ఏఎస్‌రావునగర్‌లో ప్రారంభించారు. వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు ఈ ప్రాంతంలో ఉన్న బ్రాంచ్‌ను ఆధునీకరించి నూతన హంగులతో తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఏఎస్‌రావునగర్‌లో రీలొకేట్ చేసిన మలబార్ షోరూంను బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషాసోమశేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంలు 390కి పైగా ఉన్నాయని, అందులో ఆంధ్రప్రదేశ్‌లో 43, తెలంగాణలో 23 బ్రాంచులుంటే.. హైదరాబాద్‌లోనే 15 బ్రాంచులు ఉన్నట్లు నిర్వాహకులు వివరించారు. ప్రస్తుతం నూతనంగా ప్రారంభించిన ఈ బ్రాంచ్ ద్వారా తమ కస్టమర్ల కోసం బంగారు ఆభరణాల తరుగు చార్జీలు 25 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక నేతలు కాసం మహిపాల్‌రెడ్డి, రేగళ్ల సతీష్‌రెడ్డి, బైరి నవీన్‌గౌడ్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానం వస్తే సమాచారం ఇవ్వండి !

ఘట్‌కేసర్: కొత్త వ్యక్తుల కదలికలపై అనుమానం వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ పరశురాం అన్నారు. సీపీ ఆదేశానుసారం బుధవారం ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, దేవాలయం, మజీద్, ఆర్టీసీబస్సులు, షాపింగ్‌మాల్స్, మార్టలను డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు చేపట్టామని వివరించారు.